సాక్షి ఆదిలాబాద్

శనివారం, 12 ఆగస్టు 2023

I



మస్కాపూర్‌కు మల్టీప్లెక్స్ కళ

ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఇగ్లూ థియేటర్ మల్టీప్లెక్స్‌ను తలపిస్తోంది. రోజుకు ఐదుషోలు వేసేలా హాల్‌ను తీర్చిదిద్దారు. IIలో▸



టమాటా సాగులో 'స్టేకింగ్'

టమాటా సాగుపై గుడిహత్నూర్ రైతులు ఆసక్తి చూపుతున్నారు. స్టేకింగ్ విధానంతో పాటు సస్యరక్షణ చర్యలు పాటిస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. IIIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0 /25.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేజీబీవీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల కోసం ఇటీవల ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ఇందులో మెరిట్ సాధించిన (1:3 ప్రకారం) అభ్యర్థుల సర్టిఫికెట్లను డీఈవో కార్యాలయంలో శుక్రవారం పరిశీలించారు. కేజీబీవీల్లో 66 పోస్టులు, యూఆర్ఎస్‌లో 2 పోస్టులను భర్తీ కానున్నాయి. తుది జాబితా ప్రకటిస్తామని సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ వెల్లడించారు.

నేటి నుంచి గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

కైలాస్‌నగర్: గృహలక్ష్మి ఆర్థిక సాయానికి గాను జిల్లాలో 40వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. మున్సిపల్‌తో పాటు మండలాల వారీగా వచ్చిన వాటిని సంబంధిత అధికారులు క్రోడీకరించి వివరాలను కలెక్టరేట్‌కు అందజేశారు. ఈ మేరకు శనివారం నుంచి అర్హుల గుర్తింపునకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నేటి నుంచి ఆయా మండలాలు, మున్సిపాలిటీలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ షురూ కానుంది.

మద్యం షాపులకు పెరిగిన దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: మద్యం షాపులకు శుక్రవారం భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 4న నోటిఫికేషన్ జారీ చేయగా, అధిక మాసం కారణంగా ఇప్పటివరకు మందకొడిగా అందాయి. శుక్రవారం శుభసూచికంగా భావించడంతో ఒక్కసారిగా 57 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో 53, ఉట్నూర్ స్టేషన్ పరిధిలో ఒకటి, ఇచ్చోడ స్టేషన్ పరిధిలో 3 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 40 దుకాణాలకు గాను ఇప్పటివరకు మొత్తం 92 దరఖాస్తులు అందాయి. వీటిలో ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో 85, ఉట్నూర్ స్టేషన్ పరిధిలో 2, ఇచ్చోడ స్టేషన్ పరిధిలో 5 ఉన్నాయి. ఈనెల 18 వరకు గడువు ఉండడంతో దరఖాస్తుదారులు మంచి రోజు చూసి దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గతేడాది 591 దరఖాస్తులు రాగా, ఈసారి సుమారు 700 వరకు వచ్చే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

నిరుద్యోగ భృతి అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు రూ.3,016 భృతి అందజేస్తామని ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ హామీ ఇచ్చిందన్నారు. 56 నెలలవుతున్నా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే సీఎం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సురేందర్, సూర్యకిరణ్, శివ, సచిన్, రాకేష్, సాయి, గోపి తదితరులు పాల్గొన్నారు.

బడి బలోపేతానికి శాలసిద్ధి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత (ఫైల్)

- జిల్లాలో 31 పాఠశాలలు ఎంపిక
- 7 విభాగాలు.. 46 ఉప అంశాలు
- వసతుల కల్పనకు ప్రాధాన్యం..
- అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యం
- ప్రజల భాగస్వామ్యంతో ముందుకు

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రజల భాగస్వామ్యంతో వాటిని అభివృద్ధి చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఈ మేరకు శాలసిద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి పాఠశాలలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుంది. ఇందులో జిల్లాలో 31 బడులను ఎంపిక చేసింది. విద్యా ప్రమాణాలు, ఇతర సమస్యలు, పాఠశాల స్వరూపం, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు, మౌలిక వసతులు, తదితర అంశాలను పొందుపర్చేందుకు ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసింది. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ సైతం ఇచ్చింది. త్వరలోనే ఆయా పాఠశాలల్లో అమలుకు సిద్ధమవుతోంది.

విద్యార్థుల స్థాయిని గుర్తించేందుకు..

జిల్లాలో విద్యార్థుల సామర్థ్యాలు అనుకున్న స్థాయిలో కానరావడం లేదు. గతేడాది దేశంలో చదువులో వెనుకబడిన జిల్లాగా ఆదిలాబాద్‌ను కేంద్ర ప్రభుత్వం గుర్తించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి తొలిమెట్టు కార్యక్రమం నిర్వహించి సామర్థ్యాన్ని పెంపొందించారు. ఈ విద్యా సంవత్సరం కూడా తొలిమెట్టు కార్యక్రమం కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే శాలసిద్ధి కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు, మౌలిక వసతులు తెలుసుకునేందుకు ఎస్ఎంఆర్టీ ప్రత్యేక యాప్ రూపొందించింది. ఎంపికైన పాఠశాలల వివరాలు ఎప్పటికప్పుడు ఈ యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. పాఠశాలలను మూడు స్థాయిల్లో గుర్తిస్తారు. తక్కువ స్థాయి ఉంటే లెవల్–1, మామూలు స్థాయి ఉంటే లెవల్–2, అత్యున్నత స్థాయి ఉంటే లెవల్–3 గా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత ఏవైనా స్థితిగతులు మారాయా.. లేవా అనే విషయాన్ని కేంద్ర విద్యా వనరుల శాఖ పరిశీలిస్తుంది. ఎంపికైన పాఠశాలలను రాష్ట్రస్థాయి బృందాలు పరిశీలిస్తాయి. ఈ పాఠశాలల స్థితిగతులు మారితే జిల్లాలో మరిన్ని పాఠశాలలను ఎంపిక చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పాఠశాలల సమగ్రాభివృద్ధి..

పాఠశాలల సమగ్ర అభివృద్ధిలో భాగంగా చేపడుతు న్న ఈ కార్యక్రమానికి సంబంధించి ఏడు విభాగాలలో 46 ఉప అంశాలు పొందుపరిచారు. మౌలిక వసతులు–సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిచ్చి ఇందులో 12 ఉప అంశాలను చేర్చారు. అలాగే ఉపాధ్యాయుల బోధన అభ్యసన ప్రక్రియకు సంబంధించి 9 ఉపఅంశాలు, విద్యార్థుల ప్రగతిలో 5, వృత్తిపరమైన అభివృద్ధిలో 5, ఉపాధ్యాయుల నాయకత్వ లక్షణాల్లో 5, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు–ఆరోగ్యం, పరిశుభ్రతలో 5, పాఠశాలల్లో సమాజ భాగస్వామ్యంలో 5 ఉప అంశాలను చేర్చారు.

పైలెట్ ప్రాజెక్ట్‌గా 31 పాఠశాలలు..

జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా 31 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో ఆదిలాబాద్‌అర్బన్, ఆదిలాబాద్ రూరల్, మావల మండలాలున్నాయి. వీటి పరిధిలో 15 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 11 ఉన్నత పాఠశాలలు ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు ఇటీవల శిక్షణ నిర్వహించారు. ఉన్నత పాఠశాలలకు చెందిన 33 మంది, యూపీఎస్‌ల్లోని 10 మంది, ప్రాథమిక పాఠశాలల్లో 30 మందికి శిక్షణ ఇచ్చారు. ఇందులో విద్యార్థులకు ఏవిధంగా బోధన చేయాలి.. వారి సామర్థ్యాన్ని ఎలా గుర్తించాలి.. స్వీయ మూల్యాంకనం, ప్రజల భాగస్వామ్యంతో బడి అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టాలి.. ఉన్న వనరులను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలి.. తదితర అంశాలకు సంబంధించి వివరించారు.



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు (ఫైల్)

జిల్లాలో 31 పాఠశాలల ఎంపిక

జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద 31 పాఠశాలలను ఎంపిక చేశారు. ఉపాధ్యాయులకు శిక్షణ సైతం పూర్తయింది. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయి. బడి స్థితిగతులు ఎలా ఉన్నాయనేది తెలుస్తుంది. తల్లిదండ్రులు, ప్రజల భాగస్వామ్యంతో పాఠశాలలు మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తాం. రాష్ట్రస్థాయి పరిశీలన బృందాలు కూడా తనిఖీ చేస్తాయి.

– కంటె నర్సయ్య, శాలసిద్ధి కోఆర్డినేటర్

నో పర్మిషన్!



అనుమతి లేకుండా పట్టణంలో కొనసాగుతున్న ఓ ప్రైవేట్ పాఠశాల

- అనుమతి లేకుండానే ప్రైవేట్ పాఠశాల నిర్వహణ
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహణ కొనసాగిస్తోంది. ఈ విషయం విద్యా శాఖాధికారులకు తెలిసినప్పటికీ మామూలుగా వ్యవహరిస్తున్నారు. పాఠశాల యాజమాన్యానికి రాజకీయ అండదండలు, రాష్ట్ర ఉన్నతాధికారులతో సంబంధాలు ఉండడంతో జిల్లా విద్యాశాఖాధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తోంది. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో గల ఈ పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు నిర్వహిస్తున్నారు. అనుమతుల కోసం అక్టోబర్ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ సమయంలో వీరు ఆన్‌లైన్ చేసుకోలేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులతో ప్రత్యేక అనుమతి తీసుకున్నప్పటికీ ఆన్‌లైన్‌లో మాత్రం ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేదని పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రంలోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యం నిబంధనలు మాత్రం పాటించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పాఠశాలకు అనుమతి లేదని విద్యానగర్‌కు చెందిన యువజన సంఘాలు, కాలనీవాసులు డీఈవోకు ఫిర్యాదు చేసినా చర్యలు మాత్రం చేపట్టడం లేదు. ఇదిలా ఉండగా పాఠశాల యాజమాన్యానికి చెందిన పలువురు డీఈవో కార్యాలయానికి వెళ్లి త్వరగా అనుమతులు ఇవ్వాలని ఉద్యోగులను బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'కాసులిస్తే' అన్నీ ఓకే..

గతంలో విద్యానగర్‌లోని ఇదే పాఠశాల భవనంలో ఓ ప్రైవేట్ పాఠశాల కొనసాగేది. ఆ భవనానికి ఫైర్ అధికారులు ఫైర్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు నిరాకరించారు. పాఠశాల భవనం చుట్టూ వెళ్లే విధంగా లేదని, ఫైర్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో ఆ యాజమాన్యం మరోచోట పాఠశాల నిర్వహణ కొనసాగిస్తోంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఈ భవనంలోనే కొనసాగుతున్న ఓ పాఠశాల యాజమాన్యానికి మాత్రం ఫైర్ అధికారులు అనుమతినివ్వడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. కాసులిస్తే ఎలాంటి పనులైనా చేసుకోవచ్చనే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ పాఠశాలకు ఫైర్ సర్టిఫికెట్ ఏ నిబంధనల మేరకు ఇచ్చారని ఓ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వివరణ కోరిన ఉన్నతాధికారులు జిల్లాకు చెందిన పలువురు ఫైర్ అధికారులకు మెమోలు జారీ చేసినట్లు సమాచారం. ఈ విషయమై స్టేషన్ ఫైర్ అధికారి శివాజీని వివరణ కోరగా ఉన్నతాధికారి సెలవులో ఉన్నారని, తనకు ఈ విషయం తెలియదని వివరించారు.

తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం..

అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహణ కొనసాగించరాదు. ఆ పాఠశాల యాజమాన్యం గడువు లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఉన్నతాధికారులతో ప్రత్యేక అనుమతి పొందారు. అయినప్పటికీ ఇంతవరకు ఆన్‌లైన్‌లో ప్రక్రియ పూర్తి కాలేదు. మాకు ఎలాంటి పత్రాలు సమర్పించలేదు. పాఠశాలను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం.

– ప్రణీత, డీఈవో

మందుబాబుల హల్‌చల్!



వైన్స్ ఎదుట రోడ్డు వరకు వాహనాల పార్కింగ్ ఇలా..



రోడ్డు పక్కన మద్యం సేవిస్తున్న మందుబాబులు

- వైన్స్‌ల ఎదుటే తాగేస్తున్నారు..
- రోడ్డు వరకు వాహనాల పార్కింగ్
- మహిళలకు ఇక్కట్లు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని పలు వైన్స్ షాపుల ఎదుట మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. పర్మిట్ రూమ్‌లు ఉన్నప్పటికీ రోడ్డుపైనే మద్యం తాగుతూ మత్తులో తూగుతున్నారు. ప్రధానంగా రోడ్లను ఆనుకొని ఉన్న వైన్స్‌ల వద్ద మహిళలు, విద్యార్థినులకు భద్రత కరువవుతోంది. ఈ దారిగుండా వెళ్లాలంటేనే జంకుతున్నారు. జిల్లాకేంద్రంలోని దస్నాపూర్, కలెక్టర్‌చౌక్, వినాయక్‌చౌక్, బస్టాండ్ ప్రాంతం, తెలంగాణచౌక్, పంజాబ్‌చౌక్‌లలో వైన్స్‌లు, బార్‌లు రోడ్డుకు ఆనుకొని ఉండడంతో మందుబాబులు రోడ్లపైనే ఇష్టారాజ్యంగా మందు తాగుతున్నారు. కట్టడి చేయాల్సిన పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదైన అట్రాసిటీ కేసులు, వాటి పురోగతి అంశాలను పోలీస్, రెవెన్యూ అధికారులతో కేసుల వారీగా సమీక్షించారు. పరిష్కారానికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో అట్రాసిటీ కేసులను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. బాధితులకు సత్వర న్యాయంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 30 కేసులు నమోదు కాగా ఆదిలాబాద్ డివిజన్‌లో 19, ఉట్నూర్‌లో 11 నమోదై విచారణ దశలో ఉన్నాయని తెలిపారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి విచారణ చేపడుతున్నామన్నారు. పోలీస్ శాఖ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందజేయనున్నట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కుష్బూ గుప్తా, శ్యామలా దేవి, ఆర్డీవోలు స్రవంతి, ఎల్.జీవాకర్‌రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్, నాగేందర్, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు సునీతకుమారి, రాజలింగం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాజేశ్వర్, ఐటీడీఏ ఏవో రాంబాబు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు సర్వే పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు జిల్లాలో నిర్వహించనున్న ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో లెప్రసీ నోడల్ పర్సన్లు, సూపర్‌వైజర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 16 నుంచి 31 వరకు ఆశ కార్యకర్తలు తమకు కేటాయించిన గృహాలను విధిగా సందర్శించి అందరినీ పరీక్షించాలన్నారు. అనుమానితుల పేర్లు నమోదు చేసుకొని పీహెచ్‌సీ వైద్యులకు రెఫర్ చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 1,006 బృందాలు సర్వే నిర్వహించనుండగా, 200 మంది సూపర్‌వైజర్లు మానిటరింగ్ చేయనున్నారన్నారు. శరీరంపై పాలిపోయిన రాగిరంగు మొద్దుబారిన మచ్చలు, కాళ్లు చేతులు, తిమ్మిర్లు వచ్చినట్లయితే కుష్ఠుగా అనుమానించి తమ ఇంటికి వచ్చే టీమ్‌లకు సహకరించాలని కోరారు. వైద్యాధికారులు పీహెచ్‌సీ పరిధిలో జరిగే సర్వేను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, మాతాశిశు మరణాల నివారణ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం వారికి కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో శ్రీకాంత్, ఎంసీహెచ్ అధికారి విజయసారధి, డీఎంవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం





ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో ఈ నెల 4 నుంచి కొనసాగుతున్న శ్రీమద్భాగవత సప్తాహం ముగింపు కార్యక్రమం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. సత్యభామ రుక్మిణి సమేత శ్రీ కృష్ణ కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామీజీ హాజరయ్యారు. వేద పండితుడు మేఘరాజ శర్మ భాగవతంలోని విశేషాలను భక్తులకు వివరించారు.

ఓటర్ల జాబితా నిష్పక్షపాతంగా రూపొందించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా ఓటరు జాబితా నిష్పక్షపాతంగా రూపొందించాలని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ శుక్రవారం కలెక్టర్‌ను కోరారు. నియోజకవర్గాల వారీగా పోలింగ్ బూత్ ఏజెంట్ల నియామక ఆథరైజేషన్ బీఎల్ఏ 1 ఫాం, పార్టీ ఏజెంట్ల జాబితాను కలెక్టర్‌కు అందజేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబితాలోని కొంత మంది ఓటర్లను ఇతర ప్రాంతాలకు మారుస్తున్నారన్నారు. ఇలా జరుగకుండా చూడాలని కోరారు. అనంతరం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని కలిసి వాహనదారుల ఇబ్బందులపై వినతిపత్రం అందజేశారు. నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలకు తాము వ్యతిరేకం కాదన్నారు. కానీ అన్ని పత్రాలతో పాటు నంబర్‌ప్లేట్ సక్రమంగా ఉన్నా పోలీసులు మూడు నుంచి నాలుగు రోజుల వరకు వాహనాలు ఇవ్వడం లేదన్నారు. ఆయన వెంట పార్టీ నేతలు నగేశ్, రాహుల్, సంతోష్ తదితరులున్నారు.

క్లుప్తంగా

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు హోంసిక్ సెలవులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఇటీవల పీయూసీ–1లో ప్రవేశం పొందిన విద్యార్థులకు క్యాంపస్ అధికారులు హోంసిక్ సెలవులు ప్రకటించారు. విద్యార్థులు ఇళ్లకు వెళ్లారు.

సూర్యాపూర్‌లో చోరీ

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ గ్రామానికి చెందిన తుంగ పోతలింగన్న ఇంట్లో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం .. పోతలింగం తన భార్యతో కలిసి గురువారం చేను పనులకు వెళ్లాడు. కొడుకు మేకలను మేతకు తోలుకెళ్లాడు. శుక్రవారం ఉదయం డబ్బులు అవసరమై పోతలింగం తన భార్యను బీరువాలోని డబ్బులు తీసుకురమ్మని చెప్పాడు. ఆమె బీరువా వద్దకు వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉంది. అందులోని రూ.37వేలు చోరీకి గురైనట్లు గుర్తించింది. పోతలింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి


ఏఎస్పీ ద్వారా వివరాలు తెలుసుకుంటున్న కమాండెంట్ చట్టర్జీ

భైంసా: పట్టణ సమీపంలోని రెండో బెటాలియన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని కమాండెంట్ చట్టర్జీ సూచించారు. శుక్రవారం ఆయన బెటాలియన్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్‌తో మాట్లాడి పనుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మొక్కలు నాటారు. సీఐ శ్రీను, పోలీసులున్నారు.

క్షతగాత్రుడిని ఆస్పత్రిలో చేర్చిన డీఎస్పీ


వైద్యం చేయిస్తున్న డీఎస్పీ నాగేందర్

ఉట్నూర్‌రూరల్: ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తన వాహనంలో ఎక్కించుకుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వివరాలు.. శుక్రవారం విధి నిర్వహణలో జిల్లా కేంద్రానికి వెళ్లిన డీఎస్పీ తిరిగి ఉట్నూర్‌కి వస్తున్నారు. మండలంలోని శ్యాంపూర్ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తూ ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. గాయపడ్డ అతడిని గమనించిన డీఎస్పీ నాగేందర్, అతడి గన్‌మెన్ వినోద్, సిబ్బందితో కలిసి తన వాహనంలో ఎక్కించుకొని ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులకు సమాచారం అందించి స్వయంగా దగ్గరుండి వైద్యం చేయించారు. డీఎస్పీని పలువురు అభినందించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మంచిర్యాలటౌన్: ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో సీఆర్టీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని టీఎస్‌టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొల్ల రామన్న, కార్యదర్శి గుర్రాల రాజావేణు, ఉపాధ్యక్షురాలు ఎస్.లావణ్య పాల్గొన్నారు.

మస్కాపూర్‌కు మల్టీప్లెక్స్ కళ

- ఆధునిక హంగులతో నిర్మాణం
- వంద సీట్ల కెపాసిటీతో ఏర్పాటు
- మంచి సౌండ్‌సిస్టం, హైజెనిక్ సీటింగ్
- ఇగ్లూ థియేటర్ ఏర్పాటుపై హర్షం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఇగ్లూ థియేటర్ మల్టీప్లెక్స్‌ను తలపిస్తోంది. ఇగ్లూ తరహాలో ఏర్పాటైన చేసిన ఈ థియేటర్ ఖానాపూర్‌తోపాటు సమీప మండలాల ప్రజలకు వినోదాన్ని పంచనుంది. మల్టీప్లెక్స్‌ను తలదన్నే సౌండ్‌సిస్టం, వందమంది కూర్చుండేలా హైజెనెక్ సీటింగ్‌ను ఇందులో ఏర్పాటుచేశారు. రోజుకు ఐదుషోలు వేసేలా హాల్‌ను తీర్చిదిద్దారు. ప్రస్తుతం నిర్వాహకులు నాలుగు షోలు ప్రదర్శిస్తున్నారు. బర్త్‌డేలు, మ్యారేజ్ డేలు ఇతర పార్టీల నిర్వహించుకునే వాళ్లు ముందుగా బుకింగ్ సిస్టం అవకాశాన్ని కూడా కల్పించారు. ఖానాపూర్–మెట్‌పల్లి ప్రధాన రహదారి పక్కన పల్లె వాతావరణంలో ఆహ్లాదకరంగా ఉన్న ఇగ్లూ థియేటర్ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోంది.

మూడేళ్లుగా కరువైన వినోదం

పట్టణంలోని సినిమాహాల్ మూడేళ్ల క్రితం మూతపడింది. దీంతో మండల ప్రజలు వినోదం కోసం ఖానాపూర్ నుంచి 30 కిలోమీటర్ల దూరంలోని నిర్మల్, 25 కిలోమీటర్ల దూరంలోని మెట్‌పల్లికి వెళ్లి సినిమాలు చూస్తున్నారు. ఖానాపూర్ మండలానికి సమీపంలో కడెం, పెంబి, దస్తూరాబాద్, మామడ, జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలాలున్నాయి. ఖానాపూర్ మండలం మస్కాపూర్‌లో ఇగ్లూ థియేటర్ ప్రారంభం కావడంతో ఆయా మండలాలకు వినోదం అందనుంది.


మస్కాపూర్‌లో నిర్మించిన ఇగ్లూ థియేటర్

ఆధునిక హంగులతో ఏర్పాటు

పట్టణానికి ఏ మాత్రం తీసిపోని రీతిలో ఆధునిక హంగులతో మస్కాపూర్ గ్రామంలో ఇగ్లూ థియేటర్ అందుబాటులోకి వచ్చింది. మండలానికి చెందిన నలుగురు మిత్రులు కలిసి గ్రామీణ వాతావరణంలో ఆధునిక హంగులతో ఈ థియేటర్‌ను వినూత్నంగా నిర్మించాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా సుమారు 30 గుంటల స్థలంలో సుమారు రూ.కోటికి పైగా వెచ్చించి వంద సీట్ల కెపాసిటీతో ఇగ్లూ మోడల్‌లో థియేటర్‌ను నిర్మించారు.

థియేటర్ ప్రత్యేకతలు

మల్టీప్లెక్స్‌ను తలపించేలా ఉండే ఈ థియేటర్‌లో ఏసీతో పాటు అన్ని వసతులు కల్పించారు. ముందు సీటు, వెనుక సీటు అని తేడా లేకుండా ఎక్కడ కూర్చున్నా ఒకే అనుభూతి కలుగుతుంది. థియేటర్ బయట క్యాంటిన్ ఏర్పాటు చేశారు. థియేటర్‌ను ఆహ్లాదకర వాతావరణంలో నిర్మించారు. ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకునే సౌకర్యం కూడా కల్పించారు. రిందులో ఈవెంట్స్ నిర్వహించుకునే అవకాశాన్ని కల్పించారు. ఈవెంట్స్‌ను మూడు నుంచి నాలుగు గంటల్లో మాత్రమే నిర్వహించుకునేలా నిబంధన పెట్టారు. ఇందుకోసం ముందస్తుగా బుక్ చేసుకోవాల్సి ఉంటుందని నిర్వాహకులు కమటం రవీందర్, సింగం లక్ష్మీపతిగౌడ్, కొండేరి దినేశ్, పొనగంటి రాజశేఖర్ చెబుతున్నారు. కాగా, థియేటర్‌లో సంప్రదాయబద్ధంగా అన్ని రకాల పూజాకార్యక్రమాలు ఇదివరకే పూర్తిచేసినప్పటికీ మెగాస్టార్ చిరంజీవి నటించిన 'బోలాశంకర్' నూతన సినిమాతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే రేఖానాయక్ తదితర ముఖ్యులతో ప్రారంభించారు.


ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి (ఫైల్)

సినిమాహాల్ ఆకట్టుకుంటోంది



మస్కాపూర్ గ్రామంలో ఆధునిక హంగులతో సినిమా థియేటర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో నిర్మల్, మెట్‌పల్లి లాంటి పట్టణాలకు సినిమా చూడడానికి వెళ్లేవాళ్లం. మా గ్రామంలోనే సినిమా థియేటర్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. లోపలికి వెళ్లి సినిమా చూసే సమయంలో చిన్న, పెద్ద హాల్ అని అనిపించడం లేదు. చాలా బాగుంది.

– గట్ల రవికుమార్, ఖానాపూర్

ఆన్‌లైన్ బుకింగ్ సిస్టం బాగుంది



నిత్యం ఉరుకుల పరుగుల జీవితంలో ఉక్కిరిబిక్కిరయ్యే ప్రజలకు వినోదం జీవితంలో ఎంతో ప్రాముఖ్యమైంది. మనిషి నిత్యజీవితంలో శారీరక శ్రమతో పాటు వినోదం తప్పనిసరి అయ్యింది. మూడేళ్లుగా వినోదానికి దూరంగా ఉన్న ప్రజలకు ఇగ్లూ థియేటర్ ద్వారా వినోదం సొంతం కానుంది. ఆన్‌లైన్ బుకింగ్ సిస్టం బాగుంది.

– కాలేరి దివాకర్, ఖానాపూర్

అన్ని సౌకర్యాలు కల్పించాం

ఇప్పటికే లోపల, బయట అన్ని విధాలా నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రజలకు వినోదాన్ని అందించడంతో పాటు మేము కూడా స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశంతో నలుగురం కలిసి సినిమా థియేటర్‌ను ఏర్పాటు చేశాం. ప్రేక్షలకు నూతన హంగులతో వినోదం అందించడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాం.

– కమటం రవీందర్, సింగం లక్ష్మీపతిగౌడ్, కొండేరి దినేశ్, పొనగంటి రాజశేఖర్ (నిర్వాహకులు)

చూపు వచ్చేలా చూడాలి


బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలోని డోంగర్‌గామ్ గ్రామానికి చెందిన కంటిచూపు కోల్పోయిన మడావి దేవ్‌రావ్, పెందోర్ బాదుపటేల్‌కు పరీక్షలు నిర్వహించి చూపు వచ్చేలా చూడాలని ఏఐసీసీ రీసెర్చ్ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్, బీఎస్పీ నియోజకవర్గ కార్యదర్శి సోయం రాందాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం డోంగర్‌గామ్ గ్రామానికి వచ్చి చూపు కోల్పోయినవారితో మాట్లాడారు. వైద్యులతో మాట్లాడి బాధితులను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించి చూపు వచ్చేలా చూడాలన్నారు. వినోద్‌నాయక్ వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవ్‌రావ్ చూపు కోల్పోయి సుమారు 40 రోజులైందని, బాదుపటేల్ మూడ్రోజుల క్రితం చూపు కోల్పోయాడని తెలిపారు. ఇప్పటివరకు గ్రామానికి రాని వైద్యులు పత్రిక కథనాలు చూసి రావడం ఏమిటని ప్రశ్నించారు. ఆదివాసీ గిరిజనులపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వైద్యాధికారులు బాధితులకు ముందే వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తే వారి చూపు పోయేది కాదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి బాధితులకు మెరుగైన వైద్యం అందించి చూపు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. నాయకులు పెందోర్ అంకుష్, బావ్‌రాజ్ తదితరులున్నారు.

ఎమ్మెల్యేపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఇద్దరిపై కేసు

ఇంద్రవెల్లి: ఎమ్మెల్యే రేఖనాయక్‌పై వాట్సాప్‌లో అస్యభకరంగా మాట్లాడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. మండలంలోని డోంగర్‌గామ్‌లో జరిగిన ఘటనపై ఎమ్మెల్యేపై అస్యభకరంగా మాట్లాడిన వినోద్‌నాయక్, సోషల్‌మీడియాలో వీడియో పోస్ట్ చేసిన సోన్‌కాంబ్లే బావ్‌రాజ్‌పై ఏమాయికుంటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఆరెల్లి రాందాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వినోద్‌నాయక్, సోన్‌కాంబ్లే బావ్‌రాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డోంగర్‌గామ్‌లో వైద్యశిబిరం

ఇంద్రవెల్లి: మండలంలోని డోంగర్‌గామ్ గ్రామానికి చెందిన మడావి దేవ్‌రావ్, పెందోర్ బాదు పటేల్ చూపు కోల్పోయిన విషయం తెలుసుకున్న పిట్టబోంగరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు, బోథ్ సీహెచ్‌సీ ఆప్తాల్‌మిక్ అసిస్టెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం డోంగర్‌గామ్ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. చూపు కోల్పోయిన వారికి పరీక్షలు చేశారు. మడావి దేవ్‌రావ్‌కు గతంలో ప్రభుత్వం నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో పరీక్షలు నిర్వహించగా రెండు కళ్లల్లో పొరలున్నట్లు గుర్తించి ఆపరేషన్ చేయాలని గతంలోనే వైద్యులు సూచించారని తెలిపారు. ఇటీవల అతడిని కుటుంబసభ్యులు నిర్మల్ ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేసినా హైపర్ మెచుర్ క్యాట్రక్ కారణంగా చూపు రాలేదని పేర్కొన్నారు. మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించాలని, అయినా దేవ్‌రావ్‌కు చూపు వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని తెలిపారు.


దేవ్‌రావ్‌కు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాదుపటేల్‌కు ఆపరేషన్ చేస్తే చూపు వచ్చే అవకాశం ఉండగా ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే వైద్యుల దృష్టికి తీసుకువస్తే వెంటనే వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైతే రిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేస్తామని పేర్కొన్నారు.

నిధి తవ్వకానికి అడ్డువస్తున్నాడని..

సిరికొండ: తమ చేనులో ఉన్న నిధి తవ్వకానికి అడ్డువస్తున్న తమ్ముళ్లు అన్నను అడ్డు తొలగించుకోవడానికి పథకం వేసి దొరికిపోయారు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన షేక్ బిలాల్, షేక్ సులేమాన్, షేక్ ఆదాం ముగ్గురు అన్నదమ్ములు. తమ చేనులో ఉన్న నిధి (బంగారం)ని తవ్వడానికి అన్న షేక్ ఆదాం ఒప్పుకోడని నిర్ధారించుకుని అతడిని అంతం చేయాలని షేక్ బిలాల్, షేక్ సులేమాన్ పథకం పన్నారు. గ్రామానికి చెందిన షేక్ అజ్గర్‌ను కలిసి షేక్ ఆదాంను మట్టుబెట్టడానికి గ్రామానికి చెందిన తాళ్ల రమేశ్‌తో బేరం కుదుర్చుకున్నారు. తాళ్ల రమేశ్ పథకం ప్రకారం షేక్ ఆదాంకు తన ఆవును విక్రయిస్తానని నమ్మించి ఈ నెల 5న ఇంటికి పిలిచాడు. తనే స్వయంగా చాయ్‌లో మత్తు పదార్థాలు కలిపి షేక్ ఆదాంకు ఇవ్వగా అతడు దానిని తాగలేదు. మళ్లీ 8వ తేదీన ఆదాం తన టైలర్‌షాప్‌లో పని చేస్తుండగా రమేశ్ హోటల్ నుంచి చాయ్ తీసుకువచ్చి ఆదాంకు ఇచ్చాడు. అనుమానంతో ఆదాం చాయ్ తాగలేదు. అదేరోజు సాయంత్రం ఆదాం తన చేనులో పని చేస్తుండగా రమేశ్ చాయ్ తీసుకువెళ్లాడు. దీంతో అనుమానించిన ఆదాం రమేశ్‌ను బెదిరించాడు. దీంతో రమేశ్ అసలు విషయం చెప్పాడు. దీంతో ఆదాం పోలీసులకు ఫిర్యాదు చేయగా నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

శరణ్య హంతకుడెవరు?

మంచిర్యాలక్రైం: ఈ నెల 10న జిల్లా కేంద్రంలో బత్తిని శరణ్య (27)ను అతి కిరాతకంగా హత్య చేసేంది ఎవరనేది మిస్టరీగా మిగిలింది. హత్య జరిగిన 24గంటల వరకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. పక్కా పథకం ప్రకారమే హత్యచేసి ఆధారాలు దొరకకుండా చేశారు. కుటుంబ సభ్యులు మాత్రం మృతురాలి భర్త సయ్యద్ జియా ఉల్ హక్ మరొకరి సాయంతో హత్య చేశాడని ఆరోపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సయ్యద్ కోసం వేట మొదలుపెట్టారు. సయ్యద్ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా చెన్నై ప్రాంతంలోని మధురైలో విధులు నిర్వహిస్తున్నాడన్న సమాచారం మేరకు ప్రత్యేక పోలీస్ టీమ్ అక్కడికి బయలుదేరినట్లు సమాచారం. కాగా, స్థానికంగా అనుమానితులను కొందరిని విచారిస్తున్నట్లు తెలిసింది.

నిందితుడి రిమాండ్

మందమర్రిరూరల్: ఈ నెల 9న మందమర్రి పట్టణంలోని ఒర్రెగడ్డ ఏరియాలో జరిగిన గుంటి మాధవి హత్య కేసులో ఆమె భర్త దేవేందర్‌ను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి మండలం మాల గురిజాలకు చెందిన మాధవి 2007లో మొదటి భర్తను విడిచి మందమర్రికి చెందిన దేవేందర్‌ను రెండో వివాహం చేసుకుంది. తాగుడుకు బానిసైన దేవేందర్ మద్యం మత్తులో మాధవిని కొట్టి చంపాడని ఆమె మొదటి భర్త కుమారుడు అమర్‌నాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేశామని ఏసీపీ తెలిపారు.

కేఆర్కే కాలనీలో కార్డన్ సెర్చ్


కార్డన్‌సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధి కేఆర్కే కాలనీలో శుక్రవారం రాత్రి ఆదిలాబాద్ రూరల్ సీఐ సైదారావ్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలు, తొమ్మిది ఆటోలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కొత్తవారికి ఇంటిని అద్దెకిచ్చే సమయంలో పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందజేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. శాంతి భద్రతల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కాలనీ, ఇంటి ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు సీసీ ఫుటేజ్ ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీసులు, పక్కింటివారికి సమాచారం అందించాలన్నారు. ట్రాఫిక్ సీఐ, ఎస్సైలు విష్ణువర్ధన్, సయ్యద్ ముజాహిద్, ధనశ్రీ, శివరాంతోపాటు ప్రత్యేక పోలీస్ బలగాలు పాల్గొన్నాయి.

ఆరుగురు డీటీలకు తహసీల్దార్‌గా పదోన్నతి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు డీటీలకు తహసీల్దార్‌గా పదోన్నతి లభించింది. ఈమేరకు వారికి ఆయా జిల్లాలను కేటాయిస్తూ సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి కలెక్టర్లు పోస్టింగ్ కల్పించనున్నారు.

నాయబ్ తహసీల్దార్	ప్రస్తుతం	పదోన్నతి
పి.ప్రవీణ్‌కుమార్	మావల	నిర్మల్
జె.శ్రీనివాస్ రావు	ఆదిలాబాద్ ఆర్డీవో ఆఫీస్	నిర్మల్
యు.సంతోష్‌కుమార్	తలమడుగు	నిర్మల్
ఐ.సుజాత	పౌరసరఫరాల కార్యాలయం	నిర్మల్
ఎం.రమేశ్	పౌరసరఫరాల కార్యాలయం	నిజామాబాద్
బి.రాంచందర్	ఐటీడీఏ ఉట్నూర్	రాజన్న సిరిసిల్ల

కుంసరలో మృతదేహం గుర్తింపు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామ సమీపంలోగల వాగు వద్ద స్థానికులు శుక్రవారం ఓ మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై గంగారాం ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కుళ్లిన మృతదేహానికి పంచనామా నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదల్లో మృతదేహం కొట్టుకువచ్చి ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని అక్కడే ఖననం చేసినట్లు వెల్లడించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టీ) శివారు ప్రాంతాంలో ఓ దాబా ఎదుట శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని 30–35 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు


గాయపడ్డ రాజన్న

భైంసారూరల్: భైంసా పట్టణంలోని బోకర్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం మండలం పుస్పూర్ గ్రామానికి చెందిన రాజన్న తన ద్విచక్రవాహనంపై భైంసా నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఇదే మార్గంలో మాంజ్రి గ్రామానికి చెందిన కార్తిక్, గణేశ్ ద్విచక్రవాహనంపై మాంజ్రి గ్రామం వైపు వెళ్తూ వెనుక నుంచి రాజన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. ఈప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా స్థానికులు ఆటోలో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

కుభీర్: మండలంలోని శివుని గ్రామానికి చెందిన సంపంగి లక్ష్మి(45) శుక్రవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుందని ఎస్సై ఎండీ.షరీఫ్ తెలిపారు. ఏడాది కాలంగా అనారోగ్యంతో ఉందని, భైంసా, నిర్మల్ ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదని, ఇటీవల కాళ్లు కదిలించలేని స్థితికి చేరుతుండడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుందని తెలిపారు. మృతురాలి భర్త సాయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

వెన్నునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య


సదానంద (ఫైల్)

ముధోల్: మండల కేంద్రానికి చెందిన రోళ్ల సదానంద (35) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఆయన తెలిపి వివరాల ప్రకారం.. సదానంద కొద్దినెలలుగా వెన్ను నొప్పితో బాధ పడుతున్నాడు. గురువారం సాయంత్రం నొప్పి ఎక్కువ కావడంతో భరించలేక తన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై సునీల్, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దస్నాపూర్ గ్రామానికి చెందిన జావదే లింబాజీ (27) కూలీ పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నెల రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఏ పనీ చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. శుక్రవారం ఉదయం మద్యం సేవించి ఇంటికి రాగా అతడి భార్య రూపాబాయి మందలించింది. దీంతో క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై సునీల్ రిమ్స్‌ను సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న దేశీదారు పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో బుద్దే స్వామి

కాగజ్‌నగర్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న దేశీదారును పోలీసులు పట్టుకున్నారు. కాగజ్‌నగర్ టౌన్ ఎస్‌హెచ్‌వో బుద్దే స్వామి శుక్రవారం కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాగజ్‌నగర్ టౌన్ ఎస్సై కళ్యాణ్ సిబ్బందితో కలిసి పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఉదయం రైల్వేస్టేషన్ రోడ్డులో రెండు ద్విచక్ర వాహనాల్లో చంద్రపూర్‌కు చెందిన అజయ్‌కుమార్, రోహిత్, కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన విశాల్, ఆకాష్ మహారాష్ట్ర నుంచి అక్రమంగా 1150 దేశీదారు సీసాలు తీసుకువస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.40,250 ఉంటుందని పేర్కొన్నారు. నాటుసారా, గుడుంబా, దేశీదారు, గంజాయి ఇతర మత్తుపానీయాలు అమ్మినా, తయారు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేశీదారు తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.